సాక్షి
ఒడిశా

శుక్రవారం । 7 । జూలై । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలక వర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3,23,801లు, బంగారం 110 మిల్లీగ్రాములు, వెండి 38.85 గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



భోల్‌భం యాత్రకు సన్నాహాలు

- 8లో



'సేవా' సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

- 8లో

న్యూస్‌రీల్

ఏకగ్రీవంగా కార్యవర్గ ఎన్నిక



విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గ సభ్యులు

రాయగడ: రాయగడ విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని హెడ్ పోస్టాఫీస్ సమీపంలో ఉన్న వీరబ్రహేంద్ర స్వామి మందిరంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అనంతరం జరిగిన ఎన్నికలో సంఘం గౌరవ అధ్యక్షుడిగా పొట్నూరి భాస్కరరావు, అధ్యక్షుడిగా అరటికట్టు సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా కాదా శ్రీనివాస్‌రావు, కార్యదర్శిగా కడారి శ్రీనివాస్‌రావు, సహాయ కార్యదర్శిగా చిట్టూరి సాంబాబు, కోశాధికారిగా రాలి రవి కేశవ నియమితులయ్యారు. కో–ఆర్డినేటర్‌గా జగదీష్‌ను ఎంపిక చేశారు. రానున్న మూడేళ్లలో సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని ఈ సందర్భంగా నూతన కార్యవర్గం ప్రకటించింది.

2కింటాళ్ల గంజాయి స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి బస్తాలు

బరంపురం: జిల్లా పరిధిలోని గొళంతరా పోలీసులు పార్కింగ్ చేసి ఉన్న కారులో 2 కింటాళ్ల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీనిపై ఎస్‌డీపీఓ శివశంకర్ మహాపాత్రో తెలిపిన వివరాల ప్రకారం గొళంతరా పరిధి రొండా గ్రామానికి సమీపంలోని రోడ్డు పక్కన నిలిపి ఉన్న కారులో గంజాయి ఉన్నట్లు సమాచారం అందింది. ఈ మేరకు దాడి చేసి పరిశీలించగా, 2 కింటాళ్ల గంజాయి పట్టుబడింది. అయితే పోలీసుల రాకను పసిగట్టిన నిందితులు వాహనాన్ని వదిలి, పరారయ్యారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, నిందితుల కోసం గాలిస్తున్నామని ఎస్‌డీపీఓ తెలిపారు. పట్టుబడిన సరుకు విలువ సుమారు రూ.5 లక్షలు ఉంటుందని వివరించారు.

మొక్కలు నాటిన డీఈఓ



మొక్కలు నాటుతున్న డీఈఓ ప్రదోష్‌కుమార్ నాయక్

పర్లాకిమిడి: గుసాని సమితి బెత్తగుడ గ్రామంలో జిల్లా ముఖ్య శిక్షాధికారి కార్యాలయం ప్రాంగణంలో వన మహోత్సవం గురువారం నిర్వహించారు. ఇందులో భాగంగతా డీఈఓ ప్రదోష్‌కుమార్ నాయక్ మొక్కలను నాటారు. పర్యావరణ పరిరక్షణకు అంతా కృషి చేయాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పి.సురేంద్ర పాత్రొ, సీహెచ్ వైకుంఠరావు, ఉపాధ్యాయులు దుర్గాప్రసాద్ పాఢి, సంధ్యారాణి దాస్, భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ పాల్గొని, మొక్కలు నాటారు.

అగ్నిమాపక విభాగంలో అదనపు పోస్టులు

భువనేశ్వర్: రాష్ట్రంలో మూడు వైద్య కళాశాల ఆస్పత్రుల్లో అగ్నిమాపక సేవల విభాగంలో కొత్తగా 45 ఉద్యోగాలు మంజూరయ్యాయి. ఈ మేరకు సీఎం నవీన్ పట్నాయక్ కార్యాలయం గురువారం ప్రకటన వెల్లడించింది. తాజా నిర్ణయంతో కటక్ శ్రీరామచంద్ర భంజ్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్(ఎస్‌సీబీఎం సీహెచ్), బరంపురం ఎంకేసీజీ మెడికల్ కళాశాల ఆస్పత్రి, సంబల్‌పూర్ బుర్లా వీరసురేంద్ర సాయి మెడికల్ కళాశాల ఆస్పత్రి లకు ప్రయోజనం చేకూరనుంది. కొత్తగా మంజూరైన ఉద్యోగాల్లో 3 స్టేషన్ ఆఫీసర్లు, 4 లీడింగ్ ఫైర్‌మెన్, 3 హవాల్దార్లు, 3 ఫైర్‌మెన్ డ్రైవర్, 30 ఫైర్‌మెన్ ఉద్యోగాలు ఉన్నాయి.

వరుణిడి కరుణతో..

సాగుదాం..

- రాయగడ జిల్లాలో గత వారం రోజులుగా విస్తారంగా వర్షాలు
- వర్షాధార ప్రాంతాల్లో వ్యవసాయ పనులు ముమ్మరం
- 47వేల హెక్టార్లలో వరి సాగు చేసేందుకు లక్ష్యం



ట్రాక్టర్‌తో దుక్కి పనులు చేస్తున్న దృశ్యం



దుమ్మాగుడలో రైతు సిద్ధం చేసుకున్న నారుమడి

రాయగడ: వరుణుడి కరుణతో జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఖరీఫ్ పనులు ఊపందుకున్నాయి. కాసీపూర్, బిసంకటక్, రాయగడ, కల్యాణసింగుపూర్, పద్మపూర్ సమితుల్లో ఇప్పటికే నారుమడులు సిద్ధం కాగా, రైతులు వ్యవసాయం పనుల్లో నిమగ్నమయ్యారు. ఖరీఫ్ లక్ష్యాన్ని ఈ ఏడాది చేరుకునే అవకాశం ఉందని జిల్లా వ్యవసాయశాఖ అధికారి మనోజ్‌కుమార్ ప్రధాన్ ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 1,82,604 హెక్టార్ల వ్యవసాయ భూమి ఉండగా.. ఇందులో 47వేల హెక్టార్లలో వరి పండించేందుకు లక్ష్యంగా పెట్టుకున్నారు. 48వేల హెక్టార్లలో పత్తి, 20వేల హెక్టార్లలో మొక్కజొన్న, మిగతా వాటిలో పప్పు దినుసులు, కూరగాయల సాగు చేసేందుకు సిద్ధం చేశారు. అలాగే 70వేల హెక్టార్ల పంట భూములకు సాగు నీరందించే వనరులు ఉన్నప్పటికీ మిగతా 1,12,600 హెక్టార్లు వర్షాధార భూములే ఉన్నాయి.

గతం కంటే తక్కువే..

గత వారం రోజులుగా రాయగడ జిల్లాలోని 11 సమితుల్లో అధికా వర్షపాతం నమోదైంది. రాయగడ సమితిలో 34.6, కొలనారలో 62.2, కాసీపూర్‌లో 41.6, కల్యాణసింగుపూర్‌లో 44.3, గుణుపూర్‌లో 77, పద్మపూర్‌లో 100, గుడారిలో 60, రామనగుడలో 74, బిసంకటక్‌లో 31.2, మునిగుడలో 13.6, చంద్రపూర్ సమితిలో 28 మిల్లీమీటర్ల చొప్పున వర్షపాతం రికార్డయ్యింది. ఈ ఏడాది ఇప్పటి వరకు సగటున 49 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. అయితే గత ఏడాది జూన్ నాటికి 195 మిల్లీ మీటర్ల వర్షం నమోదవ్వగా, ఈ ఏడాది రెండు రెట్లు దిగజారింది. అయితే జూలై, ఆగస్టు నెలల్లోనూ అనుకూలమైన వర్షాలు కురుస్తుంటాయి. దీనికి అనుకూలంగా వ్యవసాయ పనులు ప్రారంభమవుతాయి. జూన్‌లో అడపాదడపా వర్షాలు కురవడంతో కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికే వ్యవసాయ పనులు ప్రారంభమవ్వగా, గత వారం నుంచి కురుస్తున్న వర్షాలకు పనులు జోరందుకున్నాయి.

లక్ష్యాన్ని చేరుకుంటాం..



ఈ ఏడాది ఖరీఫ్‌లో నిర్దారిత లక్ష్యాన్ని చేరుకునే అవకాశం ఉంది. ఇప్పటి వరకు జిల్లాలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పటికీ ముమ్ముందు వర్షాలు అధికంగా కురిసే అవకాశం ఉంది. అయితే వర్షాధార భూముల్లో సాగు చేసే రైతులకు ధాన్యానికి బదులుగా ఇతర పంటలు వేసేందుకు అవగాహన కల్పిస్తున్నాం. పత్తి, కందులు, జొన్నలు వంటివి సాగు చేసుకునేలా చైతన్య పరుస్తున్నాం.

– మనోజ్‌కుమార్ ప్రధాన్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

వ్యవసాయమే ఆధారంగా..



ఈ ఏడాది వర్షాలు సకాలంలో కురుస్తాయన్న ఆశతో వరి నాడు మడులు వేశాం. నారు బాగానే మొలకెత్తింది. అయితే వర్షం పైనా పూర్తిగా ఆధారపడాల్సిన పరిస్థితి. చిన్నప్పటి నుంచి వ్యవసాయం పైనే ఆధారపడి జీవిస్తున్నాం. గత ఏడాది విస్తారంగా వర్షాలు కురవడంతో దిగుబడి బాగానే వచ్చింది. అయితే ధాన్యం అమ్మకాల సమయంలో పడుతున్న ఇబ్బందుల కారణంగా వరి సాగుపై ఆసక్తి పోతోంది.

– మండంగి రాముడు, రైతు, రంగల్‌పాడు

నమ్మకం ఉంది..



కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలతో వ్యవసాయ పనులు ప్రారంభించాం. చదువుకు స్వస్తి చెప్పి వ్యవసామే చేస్తున్నా. ప్రభుత్వం దీనికి ఆసరగా నిలుస్తోంది. వరి సాగులో మెలువలు నేర్చుకోవడం ఉపయోగకరంగా ఉంది. ఈ ఏడాది కూడా వర్షాలు అనుకూలించి, పంటలు ఆశాజనకంగా పండుతాయనే నమ్మకం ఉంది. అందుకే మూడు ఎకరాల్లో వరి పండించేందుకు సన్నాహాలు చేస్తున్నా.

– విశ్వనాథ్ నాగబొంసొ, రైతు, దుమ్మాగుడ

నీటి వనరుల పునరుజ్జీవమే లక్ష్యం



ప్రసంగిస్తున్న సీఎం నవీన్ పట్నాయక్

- సీఎం నవీన్ పట్నాయక్
- అమ్మొ పొఖొరి ప్రాజెక్టుకు శంకుస్థాపన



వనరుల పరిరక్షణలో చురుకైన పాత్ర పోషించిన కార్యకర్తలను సత్కరిస్తున్న సీఎం

భువనేశ్వర్: రాష్ట్రంలోని పట్టణాల్లో నీటి వనరులను పునరుద్ధరించే లక్ష్యంతో ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ అమ్మొ పొఖొరి ప్రాజెక్టు(మన చెరువు) ప్రాజెక్టును ప్రారంభించారు. భువనేశ్వర్ లోని లోక్ సేవా భవన్‌లో కన్వెన్షన్ సెంటర్‌లో గురువారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కొరత నివారించి, స్వచ్ఛమైన నీటిని అందించేందుకు పట్టణ నీటి వనరులను సహజమైన, స్థిరమైన పద్ధతిలో పునరుజ్జీవింపజేయడం అమ్మొ పొఖొరి లక్ష్యమని తెలిపారు. ప్రాజెక్టు దీర్ఘకాల ప్రయోజనకరంగా కొనసాగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పట్టణ ప్రాంతాల్లో, చుట్టుపక్కల ఉన్న అన్ని నీటి వనరులను అభివృద్ధి చేస్తామన్నారు. మిషన్‌శక్తి గ్రూపుల సహాయంతో పట్టణ ప్రాంతాల్లోని అనేక నీటి వనరులు పునర్వైభవం పొందుతున్నాయని పేర్కొన్నారు. ఈ చొరవ కింద రూ.120 కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టనున్నట్లు వెల్లడించారు. ఈ ప్రాజెక్టు కింద రాష్ట్రంలోని 115 పట్టణ, స్థానిక సంస్థలలో దాదాపు 2వేల నీటి వనరులను పునరుద్ధరించనున్నామన్నారు. పౌరుల వినోదం కోసం నీటి వనరులకు అమ్మొ పొఖొరి పునరుజ్జీవింప జేస్తుందని వివరించారు. జలాశయ పరిసరాల సౌందరీకరణ, పట్టణ, నగర ప్రాంతాలకు కొత్త రూపురేఖలు తీసుకొస్తాయన్నారు. మిషన్‌శక్తి మహిళల సహకారంతో నీటి వనరుల పునరుద్ధరణ, నిర్వహణ జరుగుతుందని ప్రకటించారు. జలాశయాల తీరప్రాంతం, పరిసర ప్రాంతాల వాతావరణాన్ని మెరుగు పరిచేందుకు సహజ, సేంద్రియ పద్ధతులను ఉపయోగించి అమ్మొ పొఖొరి ప్రాజెక్టు అమలు చేయనున్నట్లు స్పష్టంచేశారు. వినోదం, ఆరోగ్యకరమైన ప్రజారంజక ప్రాంగణాల్లో నీటి వనరుల అభివృద్ధి, నగరాల పర్యావరణ నిర్మాణాన్ని బలోపేతం చేసేందుకు ఇది సహాయ పడుతుందని తెలియజేశారు.

మోదీ పాలనపై ప్రజలకు వివరించండి



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి విశ్వేశ్వర తుడు

- బీజేపీ కార్యకర్తలకు కేంద్రమంత్రి విశ్వేశ్వర టుడు పిలుపు



మల్కన్‌గిరి: కార్యకర్తలతో కలిసి బలిమెలలో పర్యటిస్తున్న కేంద్రమంత్రి టుడు

జయపురం: గత 9ఏళ్ల పాలనలో ప్రధాని నరేంద్రమోదీ బీజేపీ ప్రభుత్వం అందిస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు, విజయాలను క్షేత్రసాయిలో ప్రజలకు వివరించాలని కేంద్ర ఆదివాసీ సంక్షేమశాఖ మంత్రి విశ్వేశ్వర టుడు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సబ్ డివిజన్ పరిధి కొట్‌పాడ్‌లోని ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. 2024 ఎన్నికల్లో పార్టీని గెలిపించే బాధ్యత కార్యకర్తల పైనే ఉందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని, బూత్ స్థాయి నుంచే కమిటీలు ఏర్పాటు చేసి, వాటిని బలోపేతం చేయాలని సూచించాచా. రానున్న సాధారణ ఎన్నికల్లో ఒడిశాలో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే దిశగా ప్రజాక్షేత్రంలో కృషి చేయాలని తెలిపారు. 2024లో సైతం బీజేపీ అఖండ మెజార్టీతో విజయం సాధించడం తథ్యమని జోష్యం చెప్పారు. సమావేశంలో బీజేపీ అధ్యక్షుడు సుమంత ప్రధాన్, మాజీ ఎంపీ బలభద్ర మాఝి, పార్టీ కో–ఆర్డినేటర్ మంజీర ఆర్య, సహాయ కో–ఆర్డినేటర్ రామేశ్వర జెనా, సీనియర్ నాయకులు ఖగేశ్వర పూజారి, సునీల్ త్రిపాఠి, వినాయక ఆచార్య, రుపు భొత్ర,శేఖర దాస్,ప్రదీప్ రథ్,రాజ మహంతి,సునీల్ దాస్ లతో పాటు పలువురు నేతలు పాల్గొన్నారు.

అందరూ చదవాలి..

మల్కన్‌గిరి: జిల్లాలోని కోరుకొండ సమితి బలిమెల ప్రాంతంలో కేంద్రమంత్రి టుడు పర్యటించారు. ముందుగా బలిమెల సరస్వతి శిశుమందిర్ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటిని ఆయన.. అనంతరం వసతిగృహం నిర్మాణానికి భూమిపూజ చేశారు. స్థానిక గిరిజనులతో మాట్లాడి, కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై ఆరా తీశారు. అక్కడి ఉపాధ్యాయులతో మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ చదువుకొనేలా గిరిజన గూడేల్లో అవగాహన కల్పించాలని సూచించారు. పర్యటనలో మల్కన్‌గిరి ఎమ్మెల్యే ఆదిత్య మాఢి, చిత్రకొండ తహసీల్దార్ టి.పద్మనాభ దొర, మాజీ ఎంపీ బలభద్ర మాఝి, బీజేపీ మల్కన్‌గిరి అధ్యక్షుడు నిమయ పాల్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'అపోలో' అవినీతిపై దర్యాప్తు చేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న మజ్దూర్ సంఘ్ నాయకులు

- భారతీయ మజ్దూర్ సంఘ్ డిమాండ్



ఏడీఎంకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

రాయగడ: రాష్ట్ర రాజధాని భువనేశ్వర్ లోని అపోలో ఆస్పత్రిలో పేరకుపోతున్న అవినీతిపై సీబీఐ దర్యాప్తు చేపట్టాలని భారతీయ మజ్దూర్ సంఘ్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ముఖ్యమంత్రి పేరిట వినతిపత్రాన్ని సంఘం నాయకులు జిల్లా అదనపు మేజిస్ట్రేట్ సోమనాథ్ ప్రధాన్‌కు గురువారం అందించారు. పేదల ఆరోగ్యం విషయమై ప్రభుత్వం అమలు చేసిన బిజూ స్వాస్థ్య కల్యాణ యోజన(బీఎస్‌కేవై) పథకం ద్వారా విడుదలవుతున్న లక్షలాది రూపాయల నిధులు దుర్వినియోగం అవుతున్నాయని ఆరోపించారు. దీనిపై ప్రశ్నించే వారిపై క్షక్ష సాధింపు చర్యలకు దిగుతున్నారని విమర్శించారు. ప్రశ్నించే సిబ్బందిని ఇతర ప్రాంతాకు బదిలీ చేసున్నారని, వారిని తిరిగి యథా స్థానంలో నియమించాలని డిమాండ్ చేశారు. ఆస్పత్రిలో పనిచేస్తున్న మహిళా కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అంతకు ముందు పట్టణ ప్రధాన రహదారిలో ర్యాలీ చేపట్టి, కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు. ఘం రాష్ట్రశాఖ కార్యదర్శి జోగేశ్వర్ దాస్ అధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మజ్దూర్‌సంఘ్ జిల్లా కార్యదర్శి గణేష్‌కుమార్ సాహు, అధ్యక్షుడు మోహన్‌రావు మాఝి, వర్కింగ్ ప్రెసిడెంట్ ధర్మసింగ్ నాగ్, ఉపాధ్యక్షుడు దుర్గామాధవ షెష్, రామచంద్ర హుయిక తదితరులు పాల్గొన్నారు.

తాళధ్వజం ప్రధాన భొయి సేవకుడు మృతి



నకుల భొయి(ఫైల్)

భువనేశ్వర్: బలభద్రుని రథం తాళధ్వజం ప్రధాన భొయి సేవకుడు నకుల భొయి ఎయిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. ఆయన బహుడా యాత్రలో తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. జూన్ 28న గుండిచా నుంచి శ్రీమందిరం సింహ ద్వారం ఆవరణకు వెళ్తుండగా బొడొదండొ మార్కెట్ కూడలి వద్ద తాళధ్వజం తాడు తెగడంతో ఈ ప్రమాదం సంభవించింది. తాడు పట్టుకున్న నకుల భొయి ముఖం, భుజాలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతనిని పూరీ జిల్లా ప్రధాన ఆస్పత్రిలో చేర్పించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం భువనేశ్వర్ ఎయిమ్స్‌కు తరలించారు. అక్కడి ఐసీయూలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు.

హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సుభాసిస్

- సిఫార్సు చేసిన సుప్రీంకోర్టు కొలీజియం
- ఆగస్టులో పదవీ విరమణ చేయనున్న ప్రస్తుత సీజే మురళీధర్





జస్టిస్ సుభాసిస్ తాళపత్ర

భువనేశ్వర్: రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సుభాసిస్ తాళపత్రను నియమించాలని సుప్రీంకోర్టు కొలీజియం గురువారం సిఫార్సు చేసింది. ఆయన గతంలో త్రిపుర హైకోర్టు సీనియర్ న్యాయమూర్తిగా సేవలందించారు. అలాగే ఒడిశా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు వహిస్తున్న జస్టిస్ డాక్టర్ ఎస్.మురళీధర్ ఆగస్టులో పదవీ విరమణ తర్వాత సుభాసిస్ తాళపత్ర విధులు స్వీకరించనున్నారు. 1961 అక్టోబర్ 4న త్రిపుర లోని ఉదయపూర్‌లో జన్మించిన సుభాసిస్.. 2011 నవంబర్ 15న గౌహతి హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2013లో మాత్ర రాష్ట్రం త్రిపురలో హైకోర్టు ఏర్పాటు కావడంతో అక్కడికి బదిలీ అయ్యారు. 2022 జూన్ 10న ఒడిశా హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. జస్టిస్ సుభాసిస్ అనుభవాన్ని పరిగణనలోకి తీసుకుని, సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ ఆధ్వర్యంలో కొలీజియం ఆయన పేరును ఒడిశా హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా సిఫార్సు చేసింది. రెండు హైకోర్టులలో న్యాయమూర్తిగా గణనీయమైన అనుభవాన్ని పొందారు. అతని పేరును పరిశీలిస్తున్న సమయంలో.. 2013లో ఏర్పాటై, ఇప్పటి వరకు త్రిపుర నుంచి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులుగా ఎవరూ ప్రాతినిధ్యం పొందలేదనే వాస్తవాన్ని ప్రస్తావించారు. ఇతరేతర అనుబంధ అంశాల్ని పరిశీలించిన మేరకు ప్రధాన న్యాయమూర్తిగా నియమితులయ్యేందుకు జస్టిస్ సుభాసిస్ తాళపత్ర అన్ని విధాలా అర్హులని నిర్ణయించారు.

ఈశాన్య రాష్ట్రాల నుంచి..

కలకత్తా విశ్వ విద్యాలయం నుంచి న్యాయశాస్త్రంలో పట్టభద్రుడిగా ఉత్తీర్ణులైన తరువాత సుభాసిస్.. 1990 సెప్టెంబర్ 12న ఈశాన్య రాష్ట్రాల బార్ కౌన్సిల్‌లో సభ్యునిగా నమోదు చేసుకున్నారు. ప్రధానంగా గౌహతి హైకోర్టు అగర్తల బెంచ్‌లో ప్రాక్టీస్ చేశారు. భారత రాజ్యాంగం, సివిల్, క్రిమినల్ కేసుల్లో న్యాయ పోరాట పటిమను సాధించారు. 2004 డిసెంబర్ 21న సీనియర్ న్యాయవాదిగా, 2013 సెప్టెంబర్ 13న త్రిపుర హైకోర్టు శాశ్వత న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం త్రిపుర హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా పదోన్నతి పొంది, 2019 నవంబర్ 19వరకు ఆ పదవిలో ఉన్నారు.

పితతోలిలో అలజడి



పితతోలిలో పర్యటిస్తున్న ఎస్పీ వివేక్, పోలీసులు

- బీజేడీ నాయకుడిపై ప్రత్యర్థుల దాడి



తీవ్ర గాయాలతో పడి ఉన్న కామేశ్వర్‌రెడ్డి

బరంపురం: జిల్లా పోలీసు పరిధిలోని పితతోలి గ్రామంలో మరోసారి అలజడి చోటుచేసుకుంది. చికిటి బ్లాక్ పరిధిలోని ఈ గ్రామానికి చెందిన సర్పంచ్ ఎ.రామరావు అల్లుడు, బీజేడీ నాయకుడు ఎ.కామేశ్వర్‌రెడ్డిపై ప్రత్యర్థి వర్గానికి చెందిన దుండగులు మారణాయుధాలతో దాడి చేశారు. సమాచారం అందుకున్న బరంపురం ఎస్పీ సరవణ్ వివేక్ దాడి, ఘటనా స్థలాన్ని స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రత్యర్థి వర్గీయులు చేసిన దాడిలో కామేశ్వర్‌రెడ్డి తీవ్రంగా గాయ పడినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు. నిందితుల కోసం గాలిస్తున్నామని, త్వరలోనే అరెస్ట్ చేయనున్నట్లు స్పష్టంచేశారు. బాధితుడిని ఆస్పత్రికి తరలించి, చికిత్స అందించినట్లు వివరించారు.

క్లుప్తంగా

యువకుడి వైద్యానికి ప్రభుత్వ సాయం


చికిత్స పొందుతున్న శరణ్‌దీప్

నరసన్నపేట: బీద కుటుంబానికి చెందిన కొండక శరణ్‌దీప్ వైద్యానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సాయం అందజేశారు. మంత్రి ధర్మాన ప్రసాదరావు, యువనేత రామ్‌మనోహర్ నాయుడుల కృషితో సీఎం రిలీఫ్ ఫండ్ కొన్ని గంటల్లోనే మంజూరైందని యువకుడి తల్లిదండ్రులు కొండక ఆదినారాయణ, శారదలు తెలిపారు. ఇప్పటికే దాతల సహకారంతో రాయవెల్లూరు ఆస్పత్రిలో జరుగుతోందని చెప్పారు. శరణ్‌దీప్ పరిస్థితిపై గత నెల 21న సాక్షిలో 'దాతలే దిక్కు' అనే శీర్షికన కథనం ప్రచురితం కావడంతో దాతలు స్పందించి పెద్ద ఎత్తున విరాళాలు అందజేశారు. ఇప్పుడు సీఎం రిలీఫ్ ఫండ్ కూడా మంజూరు కావడంతో తమ కుమారుడి వైద్యం సజావుగా జరుగుతుందని అమ్మానాన్నలు ఆనందం వ్యక్తం చేశారు.

భద్రంగా ఈవీఎం మిషన్లు


ఈవీఎం గోదాములను పరిశీలిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఎల్రక్టానిక్ ఓటింగ్ మిషన్ (ఈవీఎం) గోడౌన్‌లో ఉన్న వీవీ ప్యాట్‌లను రాజకీయ పార్టీల సమక్షంలో కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి శ్రీకేష్ బి.లాఠకర్ గురువారం పరిశీలించారు. స్ట్రాంగ్ రూమ్, వీవీ ప్యాట్‌లను ప్రతి మూడు నెలలకోమారు పరిశీలించాలని, అందులో భాగంగా గురువారం పరిశీలించామని తెలిపారు. దీనివల్ల జవాబుదారీతనం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో సి సెక్షన్ సూపరింటెండెంట్ ప్రకాష్, వైఎస్సార్ సీపీ ప్రతినిధి అందవరపు సూరిబాబు, టీడీపీ ప్రతినిధి పీఎంజే బాబు, సీపీఎం ప్రతినిధి గోవింద రావు, బీఎస్పీ ప్రతినిధి బొకర నారాయణరావు, సీపీఐ పార్టీ ప్రతినిధి చిక్కాల గోవింద రావు తదితరులు పాల్గొన్నారు.

12న జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

శ్రీకాకుళం అర్బన్: జిల్లా ప్రజా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు ఈ నెల 12వ తేదీన నిర్వహించనున్నట్టు జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఆర్.వెంకటరామన్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన జారీ చేశారు. బుధవారం జూలై 12న జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 10 గంటలకు స్థాయి సంఘాల సమావేశం ప్రారంభమవుతాయన్నారు. సాయంత్రం 5 గంటల వరకు సమావేశాలు జరుగుతాయని పేర్కొన్నారు.

హౌసింగ్ డీఈకి ప్రశంసా పత్రం


చీఫ్ ఇంజినీర్ నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న డీఈ రామ్మూర్తి

నరసన్నపేట: గృహ నిర్మాణ శాఖ డీఈ రామ్మూర్తికి జిల్లాలో ఉత్తమ డీఈగా అభినందిస్తూ ప్రశంసా పత్రాన్ని గృహ నిర్మాణ శాఖ చీఫ్ ఇంజినీర్ అందించారు. గృహ నిర్మాణ శాఖ 45వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా విజయవాడలో గురువారం జరిగిన కార్యక్రమంలో ప్రశంసా పత్రాన్ని ఇచ్చారు. జిల్లాలో నరసన్నపేట డివిజన్ గృహ నిర్మాణంలో గడిచిన ఏడాదిలో మంచి ప్రగతి కనబరిచినందుకు చీఫ్ ఇంజినీర్ అభినందించారు. ఈ సందర్భంగా డీఈ రామ్మూర్తి మాట్లాడుతూ ఈ స్ఫూర్తితో మరింత బాధ్యతగా పనిచేస్తామని అన్నారు.

145 మందికి నియామక పత్రాల అందజేత


నియామక పత్రాలు అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం పాతబస్టాండ్: కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో ఉపాధ్యాయ పోస్టుల భర్తీ గురువారంతో పూర్తయ్యింది. పీజీటీలో బోటనీ, కెమిస్ట్రీ, ఒకేషనల్, జనరల్ సివిక్స్, కామర్స్, ఇంగ్లిష్, గణితం, ఒకేషనల్ ఎంపీహెచ్‌డబ్ల్యూ, ఫిజిక్స్, జువాలజీ, ఒకేషనల్ జీఏసీ, ఎంఎల్‌టీలకు, సీఆర్టీలో బయో సైన్సు, ఇంగ్లీష్, హిందీ, గణితం, ఫిజికల్ సైన్సు, సోషల్ సైన్సు, పీఈటీ, తెలుగు, ప్రిన్సిపాల్ పోస్టులకు నియామకాలు చేపట్టారు. మొత్తం 145 మందికి నియామక పత్రాలు అందజేశారు. మెరిట్ రోస్టర్ ఆధారంగా నియామకాలు జరిగాయి. కార్యక్రమంలో ఏపీసీ ఆర్ జయప్రకాశ్, ఆర్‌వీఎం సిబ్బంది ఉన్నారు.

భోల్‌భం యాత్రకు సన్నాహాలు

- గుప్తేశ్వర్ క్షేత్రంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్న అధికారులు


బరంపురం: కాలినడకన బయలు దేరేందుకు సిద్ధంగా ఉన్నా బోల్‌భం భక్తులు


మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ దేవధర ప్రధాన్

జయపురం: ఏటా శ్రావణ మాసంలో సందడిగా జరిగే కొరాపుట్ జిల్లాలోని సుప్రసిద్ధ శివక్షేత్రం గుప్తేశ్వర్ భోల్‌భం భక్తుల యాత్రకు విస్తృత ఏర్పాట్లు జరిపేందుకు జయపురం దేవదాయ, ధర్మదాయ అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు జయపురం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సన్నాహక సమావేశం గురువారం నిర్వహించారు. సబ్ కలెక్టర్ దేవధర ప్రధాన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జయపురం తహసీల్దార్, దేవదాయ శాఖ అధికారులు, వివిధ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చే భక్తుల సౌకర్యార్థం తగిన ఏర్పాట్లు చేయాలని తీర్మానించారు. శాంతి భద్రతలు, తాగునీరు, ప్రాథమిక చికిత్స, విద్యుత్ సరఫరా, పారిశుద్ధ్య పరిరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. భోల్‌భం యాత్రలో భక్తుల రద్దీ, ట్రాఫిక్ నియంత్రణ బాధ్యతలు పోలీసులకు అప్పగించారు. విద్యుత్ సరఫరాను టాటా పవర్ కంపెనీకి, తాగునీటి బాధ్యత గ్రామీణ నీటి సరఫరా విభాగానికి, పారిశుద్ధ్య బాధ్యతలు జయపురం మున్సిపాలిటీ, బొరిగుమ్మ సమితి అధికారులకు, రక్షణ బాధ్యతలు అగ్నిమాపక విభాగానికి కేటాయించారు. అలాగే వివిధ స్వచ్ఛంద సంస్థలు, స్థానిక యువత సహకారం తీసుకోవాలని అభిప్రాయం వ్యక్తంచేశారు. సమావేశంలో జయపురం సదర్ పోలీసు అధికారి ఈశ్వర తండి, పట్టణ పోలీసు అధికారి బెహరా తదితరులు పాల్గొన్నారు.

కొనుగోళ్ల సందడి..

బరంపురం: శ్రావణ మాసం ప్రారంభం కావడంతో గంజాం జిల్లాలో భోల్‌భం దీక్షల సందడి మొదలైంది. ఈ నేపథ్యంలో దీక్షకు అవసరమైన సామగ్రి కోసం నగరంలోని గిరి మార్కెట్, బాపు బజార్, కొమ్మాపల్లి, పెద్ద బజార్‌లో వందలాది మంది భక్తులు సామగ్రి కొనుగోలులో బిజీగా గడిపారు. ఆదివారం నుంచి వీరంతా వివిధ నదుల నుంచి పవిత్ర జలాలను సేకరించి, కాలి నడకను వివిధ శివాలయాలకు చేరుకొని, ప్రత్యేక అభిషేకాలు చేయనున్నారు.

పర్లాకిమిడిలో..

పర్లాకిమిడి: పట్టణంలో భోల్‌భం శివభక్తులు బాలుంకేశ్వర మందిరం వద్ద దీక్షలు చేపట్టారు. పవిత్రమైన నదీ జలాలను కావడిపై మోసుకువచ్చి బలుంకేశ్వర మందిరం, సంతపేట వద్ద చంద్రశేఖర ఆలయంలో ప్రత్యేక జలాభిషేకాలు చేశారు. 4వారాలు దీక్ష పాటించే భక్తులు.. వేకువజామునే లేచి సమీపంలోని పవిత్ర జలాలు కావిడి తీసుకు వచ్చి, పరమ శివుని అత్యంత భక్తిభావంతో పూజించడం ఆనవాయితీ.


బరంపురం: గిరి మార్కెట్‌లో దీక్ష కోసం సామగ్రి కొనుగోలు చేస్తున్న భక్తులు


పర్లాకిమిడి: బలుంకేశ్వర మందిరం వద్ద భోల్‌భం భక్తులు


పర్లాకిమిడి: పూజలు చేయిస్తున్న భక్తులు

సాయం అందినా ప్రాణం దక్కలేదు


దేవాన్ష (ఫైల్)

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి మండలం చలమయ్యపేటకాలనీకి చెందిన జుత్తు సూర్యనారాయణ, అంజలి దంపతుల చిన్న కుమారుడు దేవాన్ష (19 నెలలు) గురువారం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందు తూ మృతి చెందాడు. దేవాన్ష జీర్ణాశయ క్యాన్సర్ బారిన పడటంతో ఆర్థిక పరిస్థితి బాగా లేక వైద్యం చేయించలేని స్థితిలో తల్లిదండ్రులుండగా 'చిన్ని ప్రాణానికి ఆపద' శీర్షికతో జూన్ 30న సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దాతలు స్పందించి రూ.3.50 లక్షల వరకూ సాయం అందించారు. దీంతో చికిత్స చేయించేందుకు దేవాన్షను హైదరాబాద్‌లోని ఓ ప్రవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మరణించినట్లు చలమయ్యపేట మాజీ సర్పంచ్ అంగ గున్నయ్య తెలిపారు. శుక్రవారం మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చి దేవాన్ష అంత్యక్రియలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

పిడుగుపాటుకు ఇద్దరు మృతి

రణస్థలం: మండలంలోని వెల్పురాయి గ్రామంలో పిడుగుపాటుకు గురై గురాన మహాలక్ష్మీనాయుడు(37) అనే వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు, జె.ఆర్.పురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెల్పురాయికి చెందిన మహాలక్ష్మీనాయుడు, బాలి చిన్నంనాయుడులు గ్రామానికి కొంత దూరంలో పొలంలో ఒకే గొడుగు కింద ఉండి గురువారం ఆవులు మేపుతుండగా సాయంత్రం 4గంటల సమయంలో పిడుగుపడింది. ఈ ఘటనలో మహాలక్ష్మీనాయుడు అక్కడికక్కడే మృతిచెందగా చిన్నంనాయుడుకు గాయాలయ్యాయి. మృతదేహాన్ని శవపంచనామా నిమిత్తం శ్రీకాకుళం సర్వజనాస్పత్రికి తరలించారు. క్షతగాత్రుడ్ని శ్రీకాకుళంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుడు దివ్యాంగుడు. తండ్రి శ్రీరాములు, తల్లి అమ్మన్న, ఇద్దరు అన్నదమ్ములు ఉన్నారు. జె.ఆర్.పురం ఎస్సై జి.రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మదనాపురంలో..

కొత్తూరు: మండలంలోని మదనాపురం గ్రామానికి చెందిన గెల్లంకి గోపాలరావు(48) పిడుగుపాటుకు గురై మృతిచెందాడు. అంగూరు గ్రామ సమీపంలో వంశధార నది నుంచి టైరు బండితో ఇసుక తీసుకు వస్తుండగా పిడుగు పడటంతో ఈ ఘటన చోటుచేసుకుంది. గోపాలరావుతో పాటు జత పోతులు పిడుగుపాటుకు బలయ్యాయి. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య సావిత్రి, ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఆ అస్థిపంజరం.. ఇచ్ఛాపురం వాసిది

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో దొరికిన అస్థి పంజరం కేసును స్టీల్‌ప్లాంట్ పోలీసులు ఛేదించారు. ఆ అస్థి పంజరం శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురానికి చెందిన కె.కోటేశ్వరరావుదిగా పోలీసులు గుర్తించారు. మేకల మేత కోసం వెళ్లి చెట్టు నుంచి కింద పడి అతను మృతి చెందినట్టు దర్యాప్తులో తేలినట్టు సమాచారం. ఈ నెల 1న టౌన్‌షిప్‌లో దొరికిన అస్థి పంజరం స్థానికంగా కలకలం రేకెత్తించింది. కేసును సవాలుగా తీసుకున్న స్టీల్‌ప్లాంట్ పోలీసులు అతని వద్ద దొరికిన ఏటీఎం కార్డు, కత్తి, స్వాధీనం చేసుకున్న బైక్ ఆధారంగా దర్యాప్తు ప్రారంభించారు. పదేళ్ల కిందట భార్య, ఇద్దరు పిల్లలను వదిలి వచ్చేసిన కోటేశ్వరరావు దేశపాత్రునిపాలెంలో ఓ ఒంటరి మహిళతో ఉంటున్నాడు. నిత్యం గంజాయి సేవించి చిల్లర దొంగతనాలు చేయడం వృత్తిగా మార్చుకున్నాడు. ఇందులో భాగంగా మేకలను దొంగలించడం, వాటికి మేత తేవడం అతని ప్రవృత్తి. నెల రోజుల కిందట ఆ విధంగా టౌన్‌షిప్‌కు బైక్‌పై వచ్చిన కోటేశ్వరరావు కత్తితో కొన్ని కొమ్మలు కొట్టే క్రమంలో కింద జారిపడి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. స్టీల్‌ప్లాంట్ పోలీసులు స్వాధీనం చేసుకున్న బైకును కోటేశ్వరావు బంధువులు గుర్తించడంతో కేసు చిక్కుముడి వీడింది. దొరికిన అస్థి పంజరంను పోస్టుమార్టం, ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపారు. వాటి నివేదిక ఆధారంగా దర్యాప్తు ముగియనుందని సమాచారం.


శ్రీకాకుళంలో కుక్కలకు టీకాలు వేస్తున్న దృశ్యం

టీకా.. ఓ చైతన్య దీపిక

చికిత్స లేని వ్యాధులకు చైతన్యమే చక్కని పరిష్కారమని పశుసంవర్థకశాఖ సంయుక్త సంచా లకుడు డాక్టర్ ఎం.కిశోర్ అన్నారు. ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని శ్రీకాకుళం వెటర్నరీ పోలీ క్లినిక్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే అంటువ్యాధులపై అవగాహన పెంచుకుని, క్రమం తప్పకుండా వాటికి టీకాలు వేయించాలన్నారు. అనంతరం ర్యాబిస్ వ్యాధి నివారణ టీకాల శిబిరాన్ని ప్రారంభించి అధిక సంఖ్యలో కుక్కలకు ఉచితంగా టీకాలు వేశారు. కార్యక్రమంలో వీపీసీ డాక్టర్ మనోజ్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ పొట్నూరు సూర్యం, డిప్యూటీ డైరెక్టర్ జగన్నాథం, పశు వైద్యులు డాక్టర్ ఆశాలత పాల్గొన్నారు.

–శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)


పెంపుడు శునకంతో జంతు ప్రేమికురాలు

పోలీసు శాఖ అండగా ఉంటుంది

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా హోంగార్డు యూనిట్‌లో విధులు నిర్వర్తిస్తూ ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన బి.పూర్ణారావుకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఎస్పీ జి.ఆర్.రాధిక భరోసా ఇచ్చారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో పూర్ణారావుకు జిల్లా హోంగార్డుల ఒక్క రోజు వేతన మొత్తం రూ.4.24 లక్షల నగదును చెక్కు రూపంలో అందజేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు టి.పి.విఠలేశ్వరరావు, జె.తిప్పేస్వామి, ఆర్ఐలు ఉమామహేశ్వరరావు, ప్రదీప్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఆసరాగా బీమా


భవిత కేంద్రంలో విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా అధికారులు

నందిగాం: భవిత కేంద్రాల్లో ఉన్న దివ్యాంగులను ప్రభుత్వం అందిస్తున్న విరామయ బీమా పథకంలో చేర్పించాలని జిల్లా సహిత విద్యా సమన్వయకర్త బి.గోవిందరావు అన్నారు. గురువారం నందిగాంలోని భవిత కేంద్రాన్ని జిల్లా సహిత విద్యా ఉప సమన్వయకర్త అనురాధతో కలిసి సందర్శించారు. విద్యార్థుల వివరాలను ఐఈఆర్‌టీ పినకాన రాణిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీమా పథకంలో చేరిన దివ్యాంగులకు ఆరోగ్య సేవలతో పాటు రూ.2 లక్షల బీమా పరిహారం అందుతుందన్నారు. ఏడాదికి రూ.250 ప్రీమియం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు జి.నర్సింహులు, చిన్నారావు పాల్గొన్నారు.

'సేవా' సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ సప్తగిరి ఉల్క

- ఎంపీ సప్తగిరి ఉల్క


ఎంపీకి వినతిపత్రం అందిస్తున్న ఉద్యోగుల కుటుంబీకులు

జయపురం: సబ్ డివిజన్ పరిధిలోని సేవా పేపర్ మిల్లు శ్రామికుల, విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు శక్తిమేర కృషి చేస్తానని కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉల్క హామీ ఇచ్చారు. పట్టణంలోని బాబాసాహెబ్ కల్యాణ మండపంలో సేవా పేపరు మిల్లుకు చెందిన నాలుగు కార్మిక యూనియన్లు సంయుక్తంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. శ్రామికుల సమస్యలు, ఉద్యోగ విరమణ పొందిన వారి కుటుంబాల సమస్యలను తెలుసుకున్న ఆయన.. తీవ్రంగా స్పందించారు. పేపరుమిల్లు సమస్యలను పార్లమెంట్‌లో ప్రస్తావిస్తానని తెలిపారు. అలాగే జిల్లా అధికారులు, దక్షిణ రెవెన్యూ డివిజన్ కమిషనర్‌తో చర్చించడంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకు వెళ్తానన్నారు. దాదాపు 30వేల కుటుంబాలు ఆధారపడుతున్న ఈ మిల్లు నిర్వహణపై రాష్ట్రప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. కార్మిక నేత ప్రమోద్‌కుమార్ మహంతి మాట్లాడుతూ కరోనా విపత్తు తొలగిన తరువాత 2021 నవరంబర్ 25న పేపరుమిల్లు ఉత్పాదన ప్రారంభించిందన్నారు. అయితే యాజమాన్యం మారిన తరువాత కొత్త కంపెనీ ఎంఈఆర్‌పీఎల్ బాధ్యతలు చేపట్టిందని, అప్పటి నుంచి ఉద్యోగుల పీఎఫ్, గ్రాడ్యుటీ చెల్లించడం లేదని వాపోయారు. ఈ వ్యవధిలో వివిధ కారణాలతో 30మందికి పైగా శ్రామికులు మరణించారని విచారం వ్యక్తం చేశారు. బకాయిలు చెల్లించక పోవడంతో వారి పిల్లలు చదువులు, వివాహాలు నిలిచి పోయాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, బాధిత కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. సమావేశంలో యూనియన్ నాయకులు సరోజ్ సువార్, ప్రదీప్ పంజియ, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు దుర్గాశంకర సాహు పాల్గొన్నారు.

గలగలా వంశధార


గొట్టా బ్యారేజీలో ఉన్న నీటి నిల్వ

- వంశధార నీరు విడుదల రేపు
- ఖరీఫ్‌కు పూర్తిస్థాయిలో సాగునీరు



హిరమండలం: జిల్లాలో ఖరీఫ్ పనులు ప్రారంభమయ్యాయి. రైతులు పొలం పనుల్లో బిజీగా ఉన్నారు. ఖరీఫ్‌కు పూర్తిస్థాయిలో సాగునీరు అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అందులో భాగంగా గొట్టా బ్యారేజీ నుంచి కుడి, ఎడమ ప్రధాన కాలువల ద్వారా నీటి విడుదలకు నిర్ణయించారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తిచేశారు. కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, స్థానిక ఎమ్మెల్యే రెడ్డి శాంతి, వంశధార ఎస్ఈ డోల తిరుమలరావు చేతులమీదుగా శనివారం నీరు విడుదల చేయనున్నారు. ఈ ఏడాది ఇంకా వానలు మొదలవ్వకున్నా.. గొట్టా బ్యారేజీలో కొంత నీటిని నిల్వ ఉంచారు. ఖరీఫ్ అవసరాలకు తగిన విధంగా అందించేందుకు చర్యలు చేపడుతున్నారు. అయితే గత నాలుగైదు రోజులుగా ఒడిశా కేచ్‌మెంట్ ఏరియాలో పడిన వర్షాలకు బ్యారేజీలోకి వరద నీరు వచ్చి చేరింది. ప్రస్తుతం బ్యారేజీలో 37.8 మీటర్ల నీటిమట్టం ఉంది. ఈ ఏడాది ఖరీఫ్‌కు తగ్గ నీరు బ్యారేజీలోకి చేరింది. దీంతో శివారుకు సైతం నీరు అందుతుందని అధికారులంటున్నారు.

ఎడమ ప్రధాన కాలువ ద్వారా..

గొట్టా బ్యారేజీ ఎడమ ప్రధాన కాలువ ద్వారా 1,42,000 ఎకరాలకు సాగునీరు అందుతోంది. హిరమండలం, జలుమూరు, నరసన్నపేట, పోలాకి, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి, టెక్కలి, నందిగాం, పలాస, వజ్రపుకొత్తూరు మండలాలకు ఈ కాలువ ద్వారా సాగునీరు అందిస్తున్నారు. 107 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న కాలువకు అనుసంధానంగా పిల్లకాలువలు ఉన్నాయి. ఈ ఏడాది ప్రభుత్వం ముందుచూపుతో వ్యవహరించింది. వేసవిలోనే పనులు చేపట్టింది. చాలాచోట్ల కాలువల్లో భారీగా గుర్రపు డెక్క పేరుకుపోయింది. దీన్ని కొంత మేర తొలగించారు.

కుడి ప్రధాన కాలువ ద్వారా..

కుడి ప్రధాన కాలువ 8 మండలాలను సస్యశ్యామలం చేస్తోంది. హిరమండలం, ఎల్ఎన్ పేట, సరుబుజ్జిలి, ఆమదాలవలస, శ్రీకాకుళం రూరల్, గార తదితర మండలాల్లో 82 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో కాలువను నిర్లక్ష్యం చేశారు. కిలోమీటర్ల మేర గుర్రపుడెక్క, మట్టి పేరుకుపోయింది. దీంతో శివారు ఆయకట్టుకు నీరందని పరిస్థితి. దీనిపై స్పందించిన ప్రభుత్వం ఎక్కడెక్కడ ఇబ్బందిగా ఉందో అక్కడ ముందుగానే జంగిల్ క్లియరెన్స్ చేపట్టింది. దీంతో సాగునీటి ప్రవాహానికి అడ్డంకి తొలగింది.

ఏర్పాట్లు పూర్తి



గొట్టా బ్యారేజీ కుడి, ఎడమ ప్రధాన కాలువల ద్వారా శనివారం నీటిని విడుదల చేయనున్నాం. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు పూర్తయ్యాయి. నది పరీవాహక ప్రాంతాలతో పాటు ఎగువన ఉన్న ఒడిశాలో ఆశించిన స్థాయిలో వర్షాలు పడలేదు. అయినా గత కొద్దిరోజులుగా నదిలోకి వస్తున్న నీటిని నిల్వ చేశాం. శనివారం రైతు దినోత్సవం సందర్భంగా నీరు విడుదల చేయడానికి నిర్ణయించారు. ఈ ఏడాది ఖరీఫ్‌నకు పూర్తిస్థాయిలో సాగునీరందిస్తాం.

– యలమంచిలి అనిల్‌కుమార్, ఇన్‌చార్జ్ డీఈ, గొట్టా బ్యారేజీ

క్లుప్తంగా

నేడు మైక్రో బయాలజీ ల్యాబ్ ప్రారంభం



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న మైక్రో బయాలజీ ల్యాబ్

విజయనగరం ఫోర్ట్: సర్వజన ఆస్పత్రిలో మైక్రో బయాలజీ ఆస్పత్రిని శుక్రవారం ప్రారంభించనున్నారు. ఇప్పటికే దానికి సంబంధించిన పరికరాలు ఆస్పత్రికి చేరుకోగా వాటి అమరిక కూడా పూర్తయింది. బ్లడ్‌కలర్, యూరిన్ కలర్ పరీక్షలు మైక్రో బయాలజీ ల్యాబ్‌లో చేయనున్నామని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మలీల గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

80 లీటర్ల సారా స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న సారా, పట్టుబడిన వ్యక్తి

కొమరాడ: మండలంలోని కొత్తవలస గ్రామంలో వాహన తనిఖీలు చేపడుతుండగా సారాను ద్విచక్రవాహనంతో తరలిస్తున్న వ్యక్తి గురువారం పట్టుబడ్డాడని ఎస్సై జగదీష్ నాయుడు తెలిపారు. ఈ మేరకు ఆ వ్యక్తి వద్ద ఉన్న 80 లీటర్ల సారా స్వాధీనం చేసుకోవడంతో పాటు, కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

బైక్ దొంగల అరెస్ట్

- నాలుగు బైక్‌లు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు (వెనుక ముసుగులో నిందితులు)

విజయనగరం క్రైమ్: బైక్‌ల చోరీకి పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను, ఒక మైనర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని, వారి నుంచి నాలుగు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు గురువారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బైక్ చోరీకి గురైందని స్థానికుడైన లోకేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు సీసీ పుటేజీల ఆధారంగా నిందితులను గుర్తించి నిఘా పెట్టారు. ఈ నేపథ్యంలో ప్రదీప్‌నగర్ జంక్షన్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న కొత్తూరు గ్రామానికి చెందిన ద్వారపు రెడ్డి సాయికృష్ణ, గరుగుబిల్లికి చెందిన కంజాడ సాయి, వంగర మండలాని చెందిన మైనర్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. నేరాన్ని వారు అంగీకరించడంతో వారి నుంచి నాలుగు బైక్‌లను రికవరీ చేసి అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

త్వరితగతిన ప్రభుత్వ భవనాల నిర్మాణం

పాలకొండ: గ్రామాల్లో ప్రభుత్వం మంజూరు చేసిన భవనాల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని సీతంపేట ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి ఆదేశించారు. పాలకొండ మండలంలోని పలు గ్రామాల్లో గురువారం పర్యటించారు. ముందుగా సింగన్నవలస గ్రామంలో నిర్మాణంలో ఉన్న రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లీనిక్‌లను పరిశీలించారు. నిర్మాణంలో నాణ్యతాలోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. బుక్కూరు గ్రామంలో జగనన్నకాలనీని పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. పట్టణంలోని ఇందిరానగర్ కాలనీలో పర్యటించారు. ఇటీవల ఈ కాలనీలో డెంగీ కేసులు నమోదు కావడంతో అక్కడ పరిశీలించి వైద్య సిబ్బందికి సూచనలు అందించారు. మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు.

కమిషనర్‌కు సీఆర్టీ పోస్టుల భర్తీ నివేదిక

సీతంపేట: గిరిజన సంక్షేమ ఆశ్రమపాఠశాలల్లో పనిచేస్తున్న సీఆర్టీ (కాంట్రాక్టు రెసిడెంట్ టీచర్) పోస్టులపై గిరిజన సంక్షేమశాఖ రాష్ట్ర కమిషనర్‌కు నివేదిక పంపించినట్టు గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. మొత్తం 269 పోస్టులకు గాను 215 మందికి బదిలీల కౌన్సెలింగ్ ఇటీవల నిర్వహించామన్నారు. వీరిలో ఎస్‌జీటీలు 54 మందికి వివిధ కారణాలతో నిలిపివేసినట్టు వెల్లడించారు. 39 మందికి టెట్ వంటి అర్హతలు లేవన్నారు. 15 మందికి మాత్రమే అన్ని అర్హతలు ఉన్నాయన్నారు. క్వాలిఫైడ్ అభ్యర్థులతో సీఆర్టీల భర్తీకి అనుమతి కోరుతూ ఐటీడీఏ పీఓ సూచనలమేరకు కమిషనర్‌కు నివేదించామన్నారు.

ఇద్దరి దుర్మరణం

- ఇద్దరు మహిళలకు తీవ్రగాయాలు
- మరో ముగ్గురు మహిళలకు స్వల్ప గాయాలు
- ఆటోను ట్రాక్టర్ ఢీకొనడంతో ప్రమాదం



గోగాద సత్యం



ముసలయ్య



ప్రమాద దృశ్యం

శృంగవరపుకోట: అరగంటలో ఊరికి చేరుకుంటామనుకున్న ప్రయాణంలో ఊహించని కుదుపు. ఎదురుగా ట్రాక్టర్ మృత్యుశకటంలా దూసుకొచ్చి రోడ్డు పక్కన నిలిపిఉన్న ఆటోను ఢీకొట్టంతో ఆటో, ట్రాక్టర్ బోల్తా పడ్డాయి. ఏం జరిగిందో తేరుకుని చూసేలోగా రెండు ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. ఎస్.కోట మండలంలో సంతగవిరమ్మపేట జంక్షన్ వద్ద జరిగిన ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు చనిపోగా ఇద్దరు మహిళలు తీవ్రగాయాలతో, మరో ముగ్గురు మహిళలు స్వల్ప గాయాలతో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. గురువారం మధ్యాహ్నం 12గంటల సమయంలో సుమారు 10మంది ప్రయాణికులతో ఎస్.కోట నుంచి అలుగుబిల్లికి ఆటోబయలుదేరింది. సంతగవిరమ్మపేట జంక్షన్‌కు చేరుకోగానే ప్రయాణికుడొకరు పశువులకు దాణా కొంటానని ఆటో నిలపాలని అడగడంతో డ్రైవర్ రోడ్డు పక్కన ఆటోను నిలిపాడు. ఆ వ్యక్తి దుకాణానికి వెళ్లగా మిగిలిన వారంతా ఆటోలోనే ఉన్నారు. అదే సమయంలో వచ్చిన ట్రాక్టర్ ఆటోను ఢీకొట్టడంతో సీతంపేట గ్రామానికి చెందిన ముంత ముసలయ్య(70), చుక్కవానిపాలెం గ్రామానికి చెందిన గోగాడ సత్యం(68) మృతిచెందారు. గాయాల పాలైన మహిళలను ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు.

అయ్యో పాపం..!

- బాలికపై లైంగికదాడికి పాల్పడిన యువకుడు

పూసపాటిరేగ: అభం శుభం తెలియని చిన్నారిపై మానవ మృగం దాడి చేసింది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ అమానవీయ ఘటన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఓ పాఠశాలలో మూడువ తరగతి చదువుతున్న బాలిక మంగళవారం మధ్యాహ్నం భోజన విరామసమయంలో మూత్ర విసర్జనకు పాఠశాల వెనుక ఉన్న పొలంలోకి వెళ్లింది. అదే గ్రామానికి చెందిన 17 ఏళ్ల బాలుడు బాలిక ఒంటరిగా ఉండడం చూసి కొబ్బరికాయ ఇస్తానని ప్రలోభపెట్టి సమీపంలోని తోటలోకి తీసుకెళ్లాడు. చుట్టు పక్కల ఎవరూ లేకపోవడంతో బాలికను భయపెట్టి లైంగికదాడికి పాల్పడ్డాడు. విషయం ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించి పంపించేశాడు. లైంగిక దాడి వల్ల తీవ్ర రక్తస్రావం అవుతున్నప్పటికీ బాలిక ఇంటికి వెళ్లిపోయింది. తల్లి గమనించి అడగ్గా మూత్ర విసర్జనకు వెళ్లినప్పుడు కాలుజారిపడిపోవడంతో గాయమైందని భయపడుతూ చెప్పింది. దీంతో బాలికను స్థానిక ఆస్పత్రికి తల్లి తీసుకెళ్లగా తీవ్ర రక్తస్రావం కారణంగా పరిస్థితి విషమించిందని వైద్యులు తెలిపారు. అక్కడినుంచి విజయనగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లడంతో వైద్యులు విశాఖ కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. విశాఖ వైద్యులు పరీక్ష నిర్వహించి బాలికపై లైంగికదాడి జరిగినట్లు ధ్రువీకరించారు. దీంతో దిశ పోలీస్‌స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు గ్రామానికి చేరుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు, ఎస్సై ఎ.నరేష్ పతివాడ ప్రభుత్వపాఠశాలలో జరిగిన ఘటనపై గురువారం విచారణ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు, పాఠశాల సమీపంలో ఉన్న గ్రామస్తులను విచారణ చేసి జరిగిన సంఘటనపై కేసు నమోదు చేశారు.

యువతి ఆత్మహత్య

పాలకొండ రూరల్/పాలకొండ టౌన్: పట్టణంలోని 12వ వార్డుకు చెందిన కందుల మానస(24) గురువారం మధ్యాహ్నం తన స్వగృహంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సురేష్, లక్ష్మి దంపతులు లోగిడి వీధిలో కిరాణా వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వారికి ముగ్గురు పిల్లలు. వారి రెండవ కుమార్తె మానస చిన్నతనం నుంచి బుద్ధిమాంద్యంతో పాటు ఇతర ఆరోగ్య సమస్యలతో అవస్థలు పడుతోంది. తాజాగా డిగ్రీ పరీక్షల్లో ఫెయిల్ కావడంతో మానసికంగా కుంగిపోగా బలహీనపడి కొద్ది రోజులుగా దిగులుగా ఉంటున్నట్లు తల్లితండ్రులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తమ ఇంటి పైగదిలో ఆత్మహత్యకు పాల్పడిందని చెప్పారు. కుమార్తె ఆత్మహత్యను గుర్తించిన తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్సై బి.శివప్రసాద్ మృతదేహాన్ని పరిశీలించి, పోస్టుమ్మార్టం నిమిత్తం స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఫిర్యాదుపై కేసు నమోదు చేశామని అన్ని కోణాల్లో దర్యాప్తు చేపడతామని స్పష్టం చేశారు.

గడ్డిమందు తాగి మరో యువతి..



బోయిన సంగీత మృతదేహం

కురుపాం: మండల కేంద్రంలోని శోభలతాదేవి కాలనీకి చెందిన బోయన సంగీత (25) గురువారం సాయంత్రం ఇంట్లో ఉన్న గడ్డిమందు తాగి అపస్మారక స్థితికి చేరుకుంది. ఈ విషయం గమనించిన కుటుంబసభ్యులు స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ మేరకు కురుపాం ఎస్సై సీహెచ్.ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మృతుల కుటుంబాలను ఆదుకుంటాం





మృతులకుటుంబాలను పరామర్శించి ఓదార్చుతున్న ఎమ్మెల్యే శంబంగి

- ఎమ్మెల్యే శంబంగి భరోసా
- స్వగ్రామానికి చేరుకున్న మృతదేహాలు

బాడంగి: పరాయి రాష్ట్రంలోని కోయంబత్తూరులో పాఠశాల ప్రహరీ తొలగిస్తుండగా శకలాలు మీద పడి మృతిచెందిన బాడంగి మండలం వీరసాగరం వాసులు కొల్లిజగన్నాథం, నక్కేల సత్యం, రాపాక కన్నయ్యల కుటుంబాలను ప్రభుత్వపరంగా అన్ని విధాలా ఆదుకుంటామని ఎవరూ ఆందోళన చెందాల్సిన పని లేదని బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు భరోసా ఇచ్చారు. గ్రామ సర్పంచ్ మరిపి జయలక్ష్మి కుమారుడు వేణుగోపాల నాయుడు, నారాయణ మాస్టారు, ఎంపీటీసీ గొర్లె దాలమ్మలతో కలిసి గురువారం ఆయన మృతులకుటుంబాలను పరామర్శించి తీవ్రసంతాపం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కోయంబత్తూరులో ఉండిపోయిన మృతదేహాలు స్వగ్రామానికి రప్పించేందుకు అక్కడి కలెక్టర్‌తో మన కలెక్టర్ మాట్లాడి త్వరితగతిన వచ్చేందుకు ప్రయత్నించామని చెప్పారు. అదేవిధంగా మృతులు ముగ్గురికీ వైఎస్సార్ బీమా రూ.15లక్షలు వారి వారసులకు వచ్చేలా కృషిచేస్తానని, ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందేలా చూస్తానని ధైర్యం చెప్పారు. మృతుల కుటుంబాల వారు అధైర్యపడవద్దని, అండగా ఉంటామని అనునయించారు. ఈ పరామర్శలో జెడ్పీటీసీ పెద్దింటి రామారావు, ఎంపీపీ సలహాదారు తెంటు మధుసూదన రావు, మండల జేసీఎస్ ఇన్‌చార్జ్ మరిపి శంకరరావు పాల్గొన్నారు.

లారీ ఢీకొని యువకుడి మృతి



ఘటనా స్థలంలో పూతి మహేష్ మృతదేహం, ప్రమాదానికి కారణమైన లారీ

అక్కిరెడ్డిపాలెం: బతుకుదెరువు కోసం నగరానికి వచ్చిన యువకుడిని లారీ రూపంలో మృత్యువు కాటేసింది. గాజువాక కణితి రోడ్డు వై జంక్షన్ వద్ద గురువారం జరిగిన ప్రమాదంలో యువకుడు సంఘటన స్థలంలోనే దుర్మరణం చెందాడు. గాజువాక ఎస్ఐ కొల్లి సతీష్ తెలిపిన వివరాలివీ.. పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టంనకు చెందిన పూతి మహేష్(25) స్విగ్గీలో పని చేస్తున్నాడు. మహేష్ ద్విచక్ర వాహనంపై గాజువాక కణితి రోడ్డు వై జంక్షన్ వద్దకు రాగానే.. వెనుకనే వస్తున్న లారీ బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో అతని తలపై నుంచి లారీ వెళ్లిపోవడంతో.. మహేష్ అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. సమాచారం అందుకున్న ఏసీపీ త్రినాథ్, ఎస్ఐ సతీష్ సంఘటన స్థలానికి చేరుకుని.. ప్రమాదంపై ఆరా తీశారు. వివరాలు సేకరించి ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. లారీని స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు. మహేష్ అవివాహితుడు. అతని తల్లిదండ్రులు వీరఘట్టంలోనే ఉంటున్నారని ఎస్ఐ తెలిపారు.

గిరిజన గ్రామాలకు ప్రగతి బాటలు



పాడి-ఒప్పంగి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న కురుపాం ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

- ఒప్పంగి గ్రామ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి భూమిపూజ
- రూ.కోటి.50లక్షలతో రోడ్డు పనులు

కురుపాం: గిరిజన గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రగతి'బాటలు' వేస్తోందని కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. కురుపాం మండలంలోని పాడి పంచాయతీ నుంచి ఒప్పంగి గిరిజన గ్రామానికి జాతీయ ఉపాధి హామీ నిధులు రూ.కోటి 50 లక్షల వ్యయంతో నిర్మించనున్న 2 కిలోమీటర్ల బీటీ రోడ్డు పనులకు గురువారం భూమి పూజచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన గ్రామాల అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యమిస్తోందని తెలిపారు. సంక్షేమ పథకాలను నేరుగా గిరిజన లబ్ధిదారుల ఖాతాలకు జమ చేసి ఆర్థికోన్నతికి పాటుపడుతోందన్నారు. కార్యక్రమంలో కురుపాం ఎంపీపీ శెట్టి పద్మావతి, జెడ్పీటీసీ సభ్యురాలు గొర్లి సుజాత, వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు అందవరపు కోటేశ్వరరావు, మండల కన్వీనర్ ఇంటికుప్పల గౌరీశంకరరావు, స్టేట్‌ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ అనిమి ఇందిరాకుమారి, పాడి పంచాయతీ సర్పంచ్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు 9న ఎంపికలు

బొబ్బిలి: వచ్చే నెల 11 నుంచి శ్రీకాకుళంలో మూడు రోజుల పాటు జరిగే అండర్-11 చెస్ రాష్ట్ర స్థాయి పోటీలకు సంబంధించిన సెలక్షన్స్ ఈనెల 9న నిర్వహిస్తున్నట్టు జిల్లా చెస్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గెంబలి శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శి మూడడ్ల గణేష్ నాయుడులు తెలిపారు. ఈ మేరకు గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఉదయం 9 గంటలకు నిర్వహించే మొదటి రౌండ్‌తో ఎంపికలు ప్రారంభమవుతాయన్నారు. ఎంపికల్లో పాల్గొనే వారు జనన ధ్రువీకరణ పత్రం తీసుకురావాలని స్పష్టం చేశారు. మరిన్ని వివరాలకు ఫోన్ 91823 37499 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

దివ్యాంగ క్రికెటర్‌కు కిట్ వితరణ



గణేష్‌కు క్రికెట్‌కిట్‌ను అందజేస్తున్న జిల్లాపరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం గంటస్తంభం: సెప్టెంబర్ 28 నుంచి అక్టోబర్ 8తేదీ వరకు జరగబోయే జాతీయ దివ్యాంగుల టీ-20 క్రికెట్ టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న నెల్లిమర్ల మండలం సతివాడకు చెందిన మజ్జి గణేష్‌కు జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు జెడ్పీ నిధుల నుంచి రూ. 46వేల విలువైన క్రికెట్ కిట్‌ను ప్రోత్సాహకంగా అందజేశారు. జెడ్పీ కార్యాలయంలో గురువారం జెడ్పీచైర్మన్‌ను మజ్జి గణేష్ మర్యాదపూర్వకంగా కలిశాడు. ఈ సందర్భంగా ఆయన గణేష్‌ను అభినందిస్తూ రాష్ట్రానికి, దేశానికి పేరు తేవాలని కోరారు. ఇదిలా ఉండగా దివ్యాంగుల టీ-20 టోర్నమెంట్‌లో మజ్జి గణేష్ ఆల్‌రౌండర్‌గా ఎంపికయ్యాడు. కార్యక్రమంలో జెడ్పీ ఇన్‌చార్జ్ సీఈవో కె.రాజ్‌కుమార్, నెల్లిమర్ల జెడ్పీటీసీ గదల సన్యాసినాయుడు, డీసీసీబీ చైర్మన్ చనమల్లు వెంకటరమణ, రాష్ట్ర టూరిజం డైరెక్టర్ రేగాన శ్రీను, నెల్లిమర్ల వైస్ ఎంపీపీ పతివాడ సత్యనారాయణ పాల్గొన్నారు.

యువకుడికి దేహశుద్ధి

రాజాం సిటీ: స్థానిక పాలకొండ రోడ్డులోని పొనుగుటివలస జంక్షన్ వద్ద మద్యం మత్తులో ఓ యువకుడు వీరంగం సృష్టించాడు. గురువారం ఉదయం పూటుగా మద్యం తాగిన ఆ యువకుడు జంక్షన్ వద్ద బస్సు కోసం ఎదురుచూస్తున్న మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఇది గమనించి ప్రశ్నించిన స్థానికులపై దాడికి యత్నించగా, అక్కడి వారంతా కలిసి యువకుడికి దేహశుద్ధి చేసి, పోలీసులకు అప్పగించారు.

8,9 తేదీల్లో బ్యాడ్మింటన్ క్రీడాకారుల ఎంపిక

- ఎమ్మెల్సీ, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు రఘురాజు



ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజును జ్ఞాపికతో సత్కరిస్తున్న బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రతినిధులు

విజయనగరం: 2023-24వ సంవత్సరంలో రాష్ట్రస్థాయిలో జరగబోయే షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొనే జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈనెల 8,9 తేదీల్లో నిర్వహించనున్నట్లు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు వెల్లడించారు. ఈ మేరకు గురువారం స్థానిక డీఎస్ఏ ఇండోర్‌స్టేడియంలో జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో మాట్లాడుతూ వివిధ వయస్సుల విభాగాల్లో త్వరలో జరగబోయే అంతర్ జిల్లాల పోటీల్లో పాల్గొనబోయే క్రీడాకారుల ఎంపిక పోటీలు తేదీలను ఖరారు చేసినట్లు తెలిపారు. ఈనెల 8వ తేదీన అండర్-17, అండర్-19 విభాగాల్లో బాల, బాలికలకు సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా 9వ తేదీన పురుషులు, మహిళల విభాగాల్లో సింగిల్స్, డబుల్స్ విభాగంలో ఎంపిక పోటీలు నిర్వహించి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. ఎంపిక పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ప్రవేశ రుసుం చెల్లించాల్సి ఉంటుందన్నారు. జిల్లా జట్టుకు అర్హత సాధించిన క్రీడాకారులు నెల్లూరు, చిత్తూరు, కడప జిల్లాలో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని చెప్పారు.

డిసెంబర్‌లో వెటరన్స్ ఎంపిక

అలాగే అండర్-11,13,15 వయస్సుల విభాగాలకు ఆగస్టు నెలలో..వెటరన్స్ విభాగంలో డిసెంబర్‌లో ఎంపిక పోటీలు నిర్వహిస్తామని వివరించారు. ఎంపిక పోటీల్లో పాల్గొనదలచిన క్రీడాకారులు విజయనగరం ఫోన్ నంబర్ -9133773485, ఎస్‌కోట క్రీడాకారులు -7789199534, బొబ్బిలి క్రీడాకారులు-7981111705 నంబర్, సాలూరు క్రీడాకారులు -9515729785 నంబర్, చీపురుపల్లి క్రీడాకారులు 9885830520 నంబర్‌ను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో సెట్విజ్ సీఈఓ బి.రామ్‌గోపాల్, అసోసియేషన్ ప్రతినిధులు డాక్టర్ వీఎస్ ప్రసాద్, ఎంకేబీ శ్రీను, వై.కుసుంబచ్చన్, నున్న సురేష్, ప్రసాద్, పి.శ్రీరాములు, ఎస్.మల్లికార్జునరావు, ఎం.డి అబ్దుల్ హక్, ఎల్.శ్రీనివాసరావు, వీడీ గిరి, అపర్ణ బాబు, జి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్‌గా కొండపల్లి

- డిప్యూటీ కౌన్సిల్‌గా సీతారాం



కొండపల్లి సూర్యప్రకాశ్



దబ్బాడ సీతారాం

విజయనగరం లీగల్: స్థానిక న్యాయవాదుల సంఘం సభ్యులు కొండపల్లి సూర్యప్రకాశ్ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫె న్స్ కౌన్సిల్‌గా, దబ్బాడ సీతారాం డి ప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్‌గా నియమితులయ్యారు. అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్‌గా సాయి పవిత్రను ని యమిస్తూ జిల్లా న్యాయసేవా సంస్థ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. క్రిమినల్ కేసుల్లో ఆర్థికస్థోమత లేని నిందితుల తరపున ఈ ముగ్గురూ కేసులు వాదిస్తారు. వీరు జిల్లా న్యాయసేవా సంస్థ ఆదేశాలు, సూచనల మేరకు విధులు నిర్వర్తిస్తారు. కొండపల్లి సూర్యప్రకాశ్ గతంలో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పనిచేశారు. వీరి నియామకం పట్ల పలువురు న్యాయవాదులు హర్షం వ్యక్త చేశారు. జాతీయ న్యాయసేవా సంస్థ ప్రయోగాత్మకంగా ఈ సేవలను దేశవ్యాప్తంగా ప్రవేశపెట్టింది.

ప్రియుడితో కలిసి భర్త హత్యకు కుట్ర

- హత్యాయత్నం కేసులో ముగ్గురి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న టూటౌన్ సీఐ సీహెచ్.లక్ష్మణరావు (వెనుక ముసుగులో నిందితులు)

విజయనగరం క్రైమ్: వివాహేతర సంబంధం మోజులో ఉన్న భార్య కట్టుకున్న భర్తనే కడతేర్చాలని ప్రయత్నించింది. ఈ నేపథ్యంలో భర్తకు బిర్యానీలో నిద్రమాత్రలు కలిపి పెట్టింది. దీంతో భర్త నిద్రలోకి వెళ్లిన తర్వాత వివాహేతర సంబంధం పెట్టుకున్న వ్యక్తిని పిలిపించి నైలాన్‌తాడు మెడకు బిగించి హత్య చేసేందుకు ప్రయత్నించింది. ఈ క్రమంలో భర్తకు తెలివివచ్చి కేకలు వేయడంతో అందరూ పారిపోయారు. బాధితుడు తేరుకుని టూటౌన్ పోలీసులకు బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు టూటౌన్ సీఐ సీహెచ్.లక్ష్మణరావు గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక కుమ్మరివీధికి చెందిన కోటరాజు, భార్య శ్రీదేవి, పిల్లలు బుధవారం రాత్రి ఇంట్లో నిద్రకు ఉపక్రమించారు. శ్రీదేవికి చిన గోక వీధికి చెందిన గంధవరపు రఘుతో కొంతకాలంగా వివాహేతర సంబంధం ఉంది. ఈ సంబంధానికి అడ్డుగా ఉన్న భర్తను తప్పించాలనే ఉద్దేశంతో మట్టుబెట్టాలని ప్రణాళిక వేసింది. తన భర్తను చంపేయమని రఘుకు చెప్పింది. వెంటనే రఘు ఒక ఆర్ఎంపీ డాక్టర్ దగ్గర నుంచి నిద్రమాత్రలు కొని శ్రీదేవికి ఇచ్చాడు. అవి తీసుకుని శ్రీదేవి భర్త రాజుకు బుధవారం రాత్రి మటన్ బిర్యానీలో కలిపి తినిపించింది. రాజు నిద్రలోకి జారుకున్న తర్వాత రఘుకు ఫోన్ చేసి ఇంటికి రమ్మని పిలవగా వరుసకు బావమరిది అయిన బొగ్గులదిబ్బకు చెందిన కేత శ్రీను సహాయం కోరి రూ. 20వేలకు ఒప్పందం కుదుర్చుకుని ఇద్దరూ వచ్చారు. వారు తెచ్చుకున్న నైలాన్ తాడును రాజు మెడకు బిగించి హత్య చేసేందుకు ప్రయత్నించగా మెలకువ వచ్చిన రాజు పెద్దగా కేకలు వేయడంతో అక్కడి నుంచి ఇద్దరూ పారిపోయారు. ఈ మేరకు విచారణలో నిందితులు నేరాన్ని అంగీకరించడంతో రఘు, శ్రీను, శ్రీదేవిలను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో ఎస్సై షేక్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన గొడవ



రామినాయుడు మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

రాజాం సిటీ/రేగిడి: రాజాం వారపుసంతలో జరిగిన చిన్నపాటి ఘర్షణ ఓ వ్యక్తి ప్రాణాన్ని బలితీసుకుంది. ఇద్దరు వ్యక్తుల మధ్య దళారీ సొమ్ము విషయంలో చెలరేగిన గొడవను విడిపించేందుకు వెళ్లిన వ్యక్తి ప్రాణాలు కోల్పోవడం విషాదకరం. ఈ ఘటనపై సీఐ రవికుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాజాంలో ప్రతి గురువారం జరిగే వారపు సంతకు పశువుల వ్యాపారం నిమిత్తం రేగిడి మండలంలోని అంబకండికి చెందిన మండల రామినాయుడు(రాము)(45), ఆయన బావ పప్పల శ్రీహరినాయుడు, సాకేటి లక్ష్మణ, మండల చక్రధరరావు ఎప్పటిలాగానే వచ్చారు. పదేళ్లుగా ఆవుల క్రయవిక్రయాలు చేస్తూ వచ్చే కొద్దిపాటి లాభంతో జీవనం సాగిస్తున్నారు. సాకేటి లక్ష్మణకు చెందిన ఆవును మండల చక్రధరరావు రూ.50 వేలకు జామి మండలంలోని అలమండ సంత ప్రాంతానికి చెందిన శ్రీనురాజుకు విక్రయించాడు. శ్రీనురాజు వెంటనే అదే సంత ప్రాంతానికి చెందిన జన్నెల ఈశ్వరరావుకు రూ.53 వేలకు ఆవును విక్రయించాడు. అందులో రూ.50 వేలు చక్రధరరావుకు ఇచ్చాడు. ఆ డబ్బుల్లో దళారీగా చక్రధరరావు రూ.1000 ఉంచుకుని, రూ.49 వేలను సాకేటి లక్ష్మణకు ఇచ్చాడు. దీనికి అంగీకరించని లక్ష్మణరావు చక్రధరరావుతో గొడవపడ్డాడు. ఇంతలో అలమండ సంత ప్రాంతానికి చెందిన జన్నేల ఈశ్వరరావు కలుగజేసుకుని, ఎప్పుడూ దళారీలకు ఇవ్వాల్సిన డబ్బులు ఇచ్చేందుకు ఇబ్బంది పెడతావు ఎందుకని లక్ష్మణరావుతో గొడవపడ్డాడు. మండల రామినాయుడుతో పాటు కందుకూరి సత్యనారాయణ, గండ్రేటి చక్రధర్, కెంబూరు అప్పలనాయుడు గొడవను విడిపించే ప్రయత్నం చేశారు. నన్నే తోస్తావా అంటూ రామినాయుడిపై ఈశ్వరరావు దాడికి పాల్పడ్డాడు. ఇది గమనించిన ఈశ్వరరావు కొడుకు కిశోర్ కూడా రామినాయుడు గుండెలపై పిడుగుద్దులు గుద్దడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బాధిత కుటుంబ సభ్యులు ఘటనాస్థలానికి చేరుకుని, భోరున విలపించారు. మృతుడి బావ పప్పల శ్రీహరినాయుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

'పనిష్మెంట్' చిత్ర గీతం విడుదల చేసిన కోలగట్ల



చిత్ర గీతాన్ని విడుదల చేస్తున్న కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: అంకిత ఆర్ట్స్ పతాకంపై విజయనగరానికి చెందిన మన్యాల శ్రీనివాసరావు దర్శకత్వంలో రూపొందించిన 'పనిష్మెంట్ ' చిత్ర గీతాన్ని ఏపీ శాసనసభ ఉపసభాపతి కోలగట్ల వీరభద్ర స్వామి గురువారం విడుదల చేశారు. తన నివాసం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో చిత్రబృందాన్ని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల అభినందించి సినిమా విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ చిత్రానికి దర్శకత్వంతో పాటు కథ, స్క్రీన్ ప్లే, మాటలు మన్యాల శ్రీనివాసరావు అందించారు. సాంకేతిక, చిత్రబృందంలో అధిక శాతం మంది విజయనగరం వారేనని మన్యాల శ్రీనివాస రావు ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో కో డైరెక్టర్ మన్యాల ఆకాష్, చిత్ర బృందం కిక్ శంకర్, ఎం.నవీన్ కుమార్, ఎం.విజయభాస్కర్, రాంబాబు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.